ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
శుక్రవారం 15 నవంబరు 2024

జడ్పీకి రూ.రూ.27 కోట్లు విడుదల

కర్నూలు న్యూసిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌కు 2024-2025 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.27 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా పరిషత్‌కు బేసిక్ గ్రాంట్ కింద రూ.5,33,72,556, టైడ్ గ్రాంట్ కింద రూ.8,00,59,140 మొత్తం రూ.13,34,43,696 విడుదల చేసిందన్నారు. దీంతో పాటు 53 మండల పరిషత్‌లకు బేసిక్ గ్రాంట్ కింద రూ.5,42,88,238, టైడ్ గ్రాంట్ కింద రూ.8,14,32,319 కలిపి జడ్పీకి రూ.27 కోట్లు విడుదల అయ్యాయని అన్నారు.


జీఆర్పీ బసలదొడ్డి స్టేజ్-2 ఎత్తిపోతల పథకం

రాఘువేంద్రా.. గోడు వినవా..!

పశ్చిమ ప్రాంతంలో కరువు, వలసలు నివారణే లక్ష్యంగా నిర్మించిన ప్రాజెక్టుల్లో గురురాఘవేంద్ర ఒకటి. బడ్జెట్‌లో రూ.69.04 కోట్లు ఇస్తే శాశ్వత మరమ్మతులు చేస్తారని రైతులు సంతోషించారు. అందులో రూ.63 కోట్లు విద్యుత్ బిల్లులకే కేటాయించారు. దీంతో మరమ్మతులు, నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పనుల బకాయిలు రూ.35 కోట్లు ఉంటే ఇచ్చింది రూ.11.79 కోట్లు మాత్రమే. వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ భూ సేకరణ ఊసే లేదు. హంద్రీనీవా పందికోన జలాశయం కుడి, ఎడమ కాలువ అసంపూర్తి పనులకు ఒక్కపైసా కూడా ఇవ్వలేదు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నారు. జిల్లా ప్రాజెక్టులకు కరువు తీరా నిధులు వస్తాయనుకుంటే అరకొర నిధులతో సరిపుచ్చారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.


గాజులదిన్నె ప్రాజెక్టు గేట్ల దుస్థితి ఇలా



కర్నూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన తరువాత కర్నూలు జిల్లాలో గాజులదిన్నె ప్రాజెక్టు, హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన వత్తికొండ (పందికోన) జలాశయం, ఎల్లెల్సీ కాలువలు ఉన్నా యి. గాజులదిన్నె జలాశయంలో 4.5 టీఎంసీలు మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టులు వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై అటకెక్కాయి. గుండ్రేవుల జలాశ యం అంతర్రాష్ట్ర సమస్య అంటూ పెండింగ్ ఫైళ్ల కిందకు తోసేశారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చింది. ఏకంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా బాధ్య తలు చేపట్టారు. కరువు తీరా నిధులు వస్తాయని, సాగునీటి ప్రాజెక్టులు పట్టాలెక్కి మెట్ట చేలకు తుంగ భద్ర జలాలు అందుతాయని రైతులు ఆశించారు. అయితే చివరకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పూర్తిస్థాయి తొలి బడ్జెట్‌లో అరకొర నిధులతో సరిపుచ్చారు. అందులోనూ ముప్పాతిక శాతం నిధులు కరెంటు బిల్లులు, బాకాయిలకే సరిపోవ డంతో ఉన్న ప్రాజెక్టుల మరమ్మతులు, భూ సేకరణ, పనులు పునఃప్రారంభం ప్రశ్నార్థకంగా మారింది.

కర్నూలు జిల్లా మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో రైతులు జలజీవనాడి గురురాఘవేంద్ర ఎత్తిపోతల ప్రాజెక్టులు. తుంగభద్ర నది నుంచి 3.786 టీఎంసీల నీటిని ఎత్తిపోసి ఎల్లెల్సీ చివరి ఆయకట్టు 45,790 ఎకరాలకు సాగునీరు అందించాలని 2003లో ఆనాటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ మోహన్‌రెడ్డి పట్టుబట్టడంతో అదే ఏడాది ఆగస్టు 22న రూ.177 కోట్లు నిధులు చేస్తూ అప్పటి సీఎం చంద్రబాబు జీవో ఎంఎస్ నం.132 జారీ చేశారు. కోసిగి, మంత్రాలయం, నందవరం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోడుమూరు, సి.బెళగల్, గూడూరు, కల్లూరు మండలాలలో ఎల్లెల్సీ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో గురు రాఘవేంద్ర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు.

మిగతా 6లో...

- గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు రూ.69 కోట్లు.. విద్యుత్ బిల్లులకే రూ.63 కోట్లు
- జీడీపీకి రూ.11.79 కోట్లు కేటాయింపు.. బకాయిలే రూ.35 కోట్లు..
- వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుల భూసేకరణ ఇక లేనట్లే
- ఎన్నికల ప్రచారంగా మాత్రమే గుండ్రేవుల ప్రాజెక్టు
- హంద్రీనీవా పందికోన జలాశయం కుడి, ఎడమ కాలువలు పూర్తయ్యేనా?


పనులు ఆపేయడంతో ఎక్కడికక్కడ వేదవతి ప్రాజెక్టు పైపులు


విలేకరులతో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తాం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

మంత్రాలయం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో వలసలు నివారించడానికి సాగునీటి ప్రాజెక్టు నిర్మిస్తామని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. గురువారం మంత్రాలయంలో ఓ వివాహానికి హాజరైన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వలసలు నివారణ కోసం ఆర్డీఎస్, వేదవతి, గుండ్రేవుల, గురురాఘవేంద్ర ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను భ్రష్టు పట్టించి రైతులను మోసం చేసిందని ఆరోపించారు. తుంగభద్ర నదిపై మంత్రాలయం సమీపంలో కర్నాటక ప్రభుత్వం బ్రిడ్జ్‌తో పాటు బ్యారేజీ నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథరెడ్డి, విజయరామిరెడ్డి, గువ్వల భీమన్న, వగరూరు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

సోమిశెట్టి ప్రమాణ స్వీకారం

- కుడా చైర్మన్ ప్రమాణస్వీకారం చేయించిన జేసీ
- హాజరైన టీడీపీ నాయకులు, అభిమానులు



కర్నూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ పదవి ఆయన రెండోసారి స్వీరించారు. కుడా వైస్ చైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టరు (జేసీ) బి. నవ్య సోమిశెట్టి చేత ప్రమాణస్వీకారం చేయించారు. టీజీవీ కంపెనీస్ చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, ప్రధాన కార్యదర్శి అకేపోగు ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర నాగేశ్వరరావు యాదవ్ తదితరులు హాజరై శుభకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం కుడా ఏర్పాటు చేసింది. తొలి చైర్మన్‌గా సోమిశెట్టి బాధ్యతలు చేపట్టారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పదవికి రాజీనామా చేశారు. 1982లో హైదరాబాద్ నిజాం మైదానంలో జరిగిన టీడీపీ ఆవిర్భావం సభలో పార్టీ వ్యవస్థాకుడు ఎన్టీఆర్ చేతులు మీదుగా సభ్యత్వం తీసుకున్న ముఖ్య నాయకుల్లో సోమిశెట్టి ఒకరు. దాదాపు 25 ఏళ్లు టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి నిర్వహించారు. మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబు రెండోసారి కుడా చైర్మన్ పదవి ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ హాజరు కాలేదు. ఈ నెల 25న మంత్రులు, పార్టీ రాష్ట్రస్థాయి ముఖ్యనేతలు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో సన్మాన సభ ఉంటుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టరు నంద్యాల నాగేంద్ర, టీడీపీ నాయకులు పేరపోగు రాజు, సోమిశెట్టి నవీన్, కిశోర్, ఎల్‌వీ ప్రసాద్, మహేశ్‌గౌడ్, పి.చిన్న మారెప్ప తదితరులు పాల్గొన్నారు.




సోమిశెట్టిని అభినందిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్


నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శివకేశవుల భారీ విగ్రహం

సకల శుభాల కార్తీక దీపోత్సవం

- నేడు కార్తీక పౌర్ణమి
- వివిధ ఆలయాల్లో పూజలు

కర్నూలు కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో మహిళలు అత్యంత భక్తి భావాలతో, దీపాల వెలుగులతో నిర్వహించే కార్తీక పౌర్ణమి వేడుకను శుక్రవారం ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, ధార్మిక కేంద్రాలు, ఆధ్యాత్మిక సంస్థలు, దేవాలయాల్లో పెద్ద ఎత్తున దీపోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసంలో వచ్చే ప్రతి సోమవారం, శుక్రవారాలు ఎంతో ప్రాశస్త్యంగా పేర్కొంటారు. కాగా ఈ ఏడాది శుక్రవారం రోజునే కార్తీక పౌర్ణమి వేడుక రావడం మరింత భక్తిభావాన్ని చాటేలా నిలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో శ్రీశైలం, మహానంది, అహోబిళం, యాగంటి, బుగ్గరామేశ్వరాలయం తదితర ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు, దీపతోరణాలు వెలిగించే కార్యక్రమాలు చేపట్టారు. కర్నూలు నగరంలో వినాయక ఘాట్ వద్ద కర్నూలు కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నగరంలోని సంకల్‌బాగ్ వద్ద గల హరిహర క్షేత్రంలో, తుంగభద్ర నదీ తీరంలోనూ మహిళా భక్తులు దీపోత్సవాలు నిర్వహిస్తున్నారు.



విద్యార్థులకు విలువలు నేర్పించాలి

బాలల దినోత్సవంలో ఎస్పీ బిందు మాధవ్

వెల్దుర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు విలువలు నేర్పించాలని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. గురువారం వెల్దుర్తి మండలం అల్లుగుండు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బాలల దినోత్సవం కార్యక్రమానికి ఎస్పీ బిందుమాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎస్పీ బిందుమాధవ్‌కు సీఐ మధుసూదనరావు, ఎస్ఐ అశోక్, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో పరిచయం చేసుకొని మాట్లాడారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ బిస్కెట్లు, చాకెట్లు అందజేశారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడు.. విద్యార్థులు బాగా చదివి తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే ప్రశ్నించడం నేర్చుకోవాలన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లు 1098, 118, మరియు 112, 100 లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు ప్రసాద్, అబ్దుల్ గౌస్, వెల్దుర్తి సీఐ మధుసూదన్‌రావు, ఎస్ఐ అశోక్‌లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వెల్దుర్తి ఎంపీపీ పాఠశాలలో చిన్నారులతో ఎస్పీ బిందు మాధవ్

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి : కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడలో ఘోరంగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కే. ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 8 నుంచి 13వరకు ఆ పార్టీ చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమం ముగింపు సందర్భంగా గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయకపోగా భారం మోపడం దారుణమని అన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త విద్యుత్ మీటర్లు పెట్టే విధానాన్ని మానుకోవాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయాలని కోరారు. రైతు భరోసా కింద సాధారణ రైతులకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. బీజేపీతో రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తున్నప్పటికీ రాష్ట్రానికి పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ గురించి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన చంద్రబాబు ప్రస్తుతం ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి. నిర్మల, జిల్లా కార్యదర్శి డి. గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు రామక్రిష్ణ, నారాయణ, గురుశేఖర్ పాల్గొన్నారు.

రూ. 20 కోట్లు ఆశచూపి..

- జీఎస్‌టీ రూ.15 లక్షలు చెల్లించాలని మోసం
- నలుగురు నిందితుల అరెస్టు

7లో

ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్

ఈ. తాండ్రపాడులో ప్రారంభించిన డీఎంఅండ్‌హెచ్ఓ

7లో

నాడు పీఎస్ నేడు ఐఏఎస్



స్ఫూర్తిదాయకం ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి ప్రస్థానం

6

ఆలయాల నల్లమల

- ప్రకృతి రమణీయత మధ్య ప్రాచీన పుణ్యక్షేత్రాలు
- జాగరణకు ఏర్పాట్లు చేస్తున్న ఆలయాల నిర్వాహకులు

నల్లమల అడవులు ప్రసిద్ధ శైవ క్షేత్రాలకు నెలవు. శ్రీశైలం, మహానంది, యాగంటి, సంగమేశ్వరం, ఓంకారం, కొలనుభారతి వంటి ఆలయాలు నల్లమలలో ఒడిలో ఒదిగి ఉన్నాయి. మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం కావడంతో ఈ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో ప్రతిధ్వనిస్తున్నాయి. కార్తీక సోమవారాలు, సెలవు రోజుల్లో ఆయా క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ప్రత్యేకించి కార్తీక పౌర్ణమి రోజున స్వామివారిని దర్శించుకునేందుకు భక్తజనులు పోటెత్తనున్నారు. నవంబరు 1వ తేదీన కార్తీక మాసం మొదలై డిసెంబరు 1కి పూర్తి కానుంది. ఇందులో నవంబరు 15వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు పౌర్ణమి శోభను సంతరించుకోనున్నాయి. ప్రత్యేకించి ఈ శైవ క్షేత్రాలకు కార్తీక పౌర్ణమి రోజున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా వుంటే కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పలు శైవక్షేత్రాలకు ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. అయితే రుద్రకోడూరు, నాగలూటి, చిన్నగుమ్మితం, పెద్దగుమ్మితం క్షేత్రాలకు ప్రైవేట్ వాహనాల్లో అటవీ అధికారుల అనుమతుల మేరకు వెళ్లాల్సి ఉంది.


-ఆత్మకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి)



శ్రీశైల మహాక్షేత్రం : ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనార్థం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని క్షేత్రంలో లక్ష దీపోత్సవం, పుష్కరిణికి నవవిధ హారతులు, జ్వాలాతోరణం వంటి క్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టనున్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఇప్పటికే దేవస్థానం అధికారులకు భక్తులకు సదుపాయాలు కల్పిస్తున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లు, ప్రత్యేక లడ్డూ కౌంటర్లు, అన్నదానం తదితర వసతులను ఏర్పాటు చేస్తున్నారు.



మహానంది క్షేత్రం : నల్లమల ప్రకృతి అందాల నడుమ వెలసిన మహానంది క్షేత్రాన్ని నందన చక్రవర్తి కాలంలో నిర్మించినట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. అత్యంత ప్రాచీన ఈ క్షేత్రంలో కామేశ్వరీ సహిత మహానందీశ్వరుడి దర్శనార్థం కార్తీక మాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. క్షేత్ర పరిధిలోని రుద్రగుండ కోనేరులో, ఆలయ వెలుపల ఉన్న చిన్నపాటి రెండు కోనేరుల్లో భక్తులు కార్తీక పుణ్య స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున ఇక్కడ దీపోత్సవం నిర్వహిస్తారు.



సంగమేశ్వర క్షేత్రం: కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమ క్షేత్రంలో సంగమేశ్వరాలయం నదీజలాల్లో నీటమునగడంతో ప్రస్తుతం ఎగువ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను జరపనున్నారు. క్షేత్రంలో ఎగువ పుష్కర ఘాట్ వరకు నదీ జలాలు ఉండటంతో భక్తులు సప్తనదీ జలాల్లో పుణ్య స్నానాలు ఆచరించి దీపాలను వెలిగించనున్నారు. దీంతో కార్తీక పౌర్ణమి రోజుకే క్షేత్రంలో వేపదారు శివలింగం దర్శనభాగ్యం భక్తులకు కలగనుంది. అలాగే ఎగువ ఉమామహేశ్వరాలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించవచ్చు.



కొలనుభారతి క్షేత్రం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్షేత్రంలో అమ్మవారు నాలుగు చేతులు కలిగి ఉత్తర ముఖంగా దర్శనభాగ్యం కల్పించి కుడి రెండు చేతుల్లో పాశం, అభయహస్తాన్ని కలిగి ఉంటుంది. అదేవిధంగా ఎడమవైపు రెండు చేతుల్లో పుస్తకం, అంకుశం(గొడ్డలి) కలిగి భక్తులకు దర్శనమిస్తారు. అయితే రాష్ట్ర విభజన నేపథ్యంలో ప్రస్తుత నవ్యాంధ్రలో ఏకైక సరస్వతి ఆలయంగా కొలను భారతి క్షేత్రం విరాజిల్లుతోంది. కాగా క్షేత్రానికి వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పనతో పాటు తమ చిన్నారులకు బీజాక్షర క్రతువులు, అక్షరాభ్యాసం చేయించేందుకు చర్యలు చేపట్టారు.

నాగలూటి వీరభద్రాలయం : బైర్లూటి నుంచి 8 కి.మీ దూరంలో ఉన్న నాగలూటిలో వెలసిన శ్రీశైల ద్వారపాలకుడు వీరభద్రస్వామి ఆలయం ఎంతో ప్రఖ్యాతి గాంచింది. శ్రీశైల క్షేత్రానికి కాలినడకన వెళ్లే పాదయాత్రికులంతా స్వామివారిని దర్శించుకునే వెళ్లాల్సి ఉంది. ఈ క్షేత్రానికి కూడా కార్తీక మాసంలో భక్తులు వస్తుంటారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రానికి తరలివెళ్లే యాత్రికులు వీరభద్రుడ్ని దర్శించుకుని వెళ్తారు.





యాగంటి క్షేత్రం : ప్రసిద్ధి పుణ్యక్షేత్రాల్లో యాగంటి కూడా ఒకటి. ఈక్షేత్రంలోని ప్రధాన ఆలయంలో ఉమామహేశ్వర స్వామిఅమ్మవార్లు లింగంలో కొలువై ఉన్నారు. శివ పార్వతులు ఇద్దరూ లింగంలో దర్శనమివ్వడం ఇక్కడ విశేషం. ఈ క్షేత్రంలో యాగంటి బసవన్న స్వయంభువుగా వెలిసినట్లు చరిత్ర చెబుతోంది. ఈ నంది విగ్రహం రాను రాను పెరుగుతూ ఆలయ ప్రాంగణాన్ని ఆక్రమిస్తోంది. ఇక్కడ మరోవిశేషం ఏమిటంటే ఈ క్షేత్రంలో కాకులు కనిపించకపోవడం. ఈ క్షేత్రంలో ప్రకృతి ఒడిలో పట్టిన జలధార పర్వతసానువుల్లో ప్రవహించి కోనేరులోకి చేరుతుంది. ఈ కోనేరును అగస్త్య పుష్కరిణిగా పిలుస్తారు.



పెద్దగుమ్మితం: మండల పరిధిలోని వడ్లరామాపురం గ్రామానికి 6 కి.మీ దూరంలో గల ఎత్తైన నల్లమల కొండల్లో వెలసిన గుప్తమల్లికార్జున స్వామి క్షేత్రం ఎంతో ఖ్యాతి కెక్కింది. ఇక్కడ కొలువైన ముక్కంటేశ్వరుడిని, ధాన్య భ్రమరాంబ దేవిని భక్తితో కొలిస్తే కోరికలు సిద్ధిస్తాయన్నది భక్తుల విశ్వాసం. వడ్లరామాపురం, ఇందిరేశ్వరం చెంచు గూడేల నుంచి భక్తులు కాలినడకన అటవీమార్గం గుండా ఇక్కడికి చేరుకుంటారు.

చిన్నగుమ్మితం: ఇందిరేశ్వరం చెంచు గూడెం నుంచి 3 కి.మీ దూరంలో ఉన్న నల్లమల అడవుల్లో ఈ క్షేత్రం వెలసింది. ఇక్కడ కొలువైన స్వామి అమ్మవార్లను మల్లికార్జున, భ్రమరాంబ దేవిగా పిలుస్తారు. ఈ ఆలయం ఎంతో పురాతన మైనదిగా, మహిమలు కలిగినదిగా భక్తుల నమ్మకం, ఈ క్షేత్రంలో కూడా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

రుద్రకోటేశ్వరాలయం : మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామం నుంచి 15 కి.మీ దూరంలో నల్లమల అరణ్యంలో వెలసింది. పూర్వం ఈ క్షేత్రంలో పరమేశ్వరుడు స్వయంభూ లింగరూపంలో వెలసినట్లు పురాణ ఇతిహాసాలు చెబుతున్నాయి. ఆలయానికి ఈశాన్యంలో ఓ కల్ప వృక్షం ఉంది. ఈ వృక్షాన్ని తాకితే అమృతం స్రవించడమే కాకుండా వృక్షాన్ని పూజిస్తే సంతాన ప్రాప్తి కల్గుతుందని భక్తుల విశ్వాసం. కార్తీక పౌర్ణమి సందర్భంగా క్షేత్రంలో దీపోత్సవాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఓంకార క్షేత్రం : జిల్లాలోని బండిఆత్మకూరు మండలంలో వెలసిన ఓంకార క్షేత్రం కార్తీక మాస శోభ సంతరించుకుంది. చాళుక్యుల కాలంలో క్షేత్ర నిర్మాణం జరిగినట్లు ఇక్కడి పురాణాలు చెబుతున్నాయి. కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రంలో వెలసిన గంగా ఉమా సమేత సిద్దేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు విశేషంగా తరలి వస్తుంటారు. అలాగే ఎగువ ఉన్న కొండపై కాశీవిశాలక్ష్మి అమ్మవారి ఆలయం, వేంకటేశ్వరుడిని సన్నిధితోపాటు పలువురి దేవతామూర్తుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కాగా దిగువ క్షేత్రంలో ఉన్న కోనేరులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఐదుగురి ఎంపిక

కర్నూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లను ఎంపిక చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఐదుగురికి అవకాశం లభించింది. వాల్మీకి/బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కర్నూలు నియోజకవర్గానికి చెందిన బోయ మురళి (బీజేపీ), బోయ సంజీవలక్ష్మి(టీడీపీ), తోళ్ల మంజునాథ్ (జనసేన), డోన్ నియోజకవర్గం నుంచి మాజీ జడ్పీటీసీ సభ్యుడు వలసల రామకృష్ణ (టీడీపీ)కి అవకాశం దక్కింది. మాదిగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కర్నూలుకు చెందిన టీడీపీ నాయకుడు డి.శ్రీనివాసులును ఎంపిక చేశారు.

వైసీపీ హయాంలోని అక్రమ లే అవుట్లపై విచారణ: సోమిశెట్టి



కర్నూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నాటి చైర్మన్ అండదండలతో అక్రమ లే-అవుట్లు వేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టినట్లు తనకు ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై విచారణ చేసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం కుడా చైర్మన్ బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధినేత, సీఎం చంద్రబాబు ఈ పదవి ఇచ్చారని అన్నారు. అవినీతి అక్రమాలకు తావులేకుండా బాధ్యతలు నిర్వర్తిస్తానన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే అక్రమ లే-అవుట్లను ఉపేక్షించేది లేదన్నారు. గత చైర్మన్ అవినీతి అక్రమాలు వల్ల ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి తీసుకొచ్చారని, ఈ స్థితిలో మార్పు తీసుకొస్తానని అన్నారు.

రమణీయం.. రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకి సేవ

మంత్రాలయం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకి సేవ రమణీయంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో ఉంచి వైభవంగా ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ చేశారు. కార్తీక శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని గురువారం మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు కార్తీక దండకా స్నానం ఆచరించారు. అనంతరం తడి దుస్తులతో రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు గురువారం పోటెత్తారు. మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిర్సింది. ప్రత్యేక ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు.

మంత్రాలయంలో హుబ్లీ పీఠాధిపతి

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నాటకలోని హుబ్లీ ఆదిశంకరాచార్య అద్వైత మఠం పీఠాధిపతి శివానంద భారతి తీర్థులు గురువారం మంత్రాలయం వచ్చారు. స్వామిజీకి మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శివశంకర్ అమరన్న సతీ సమేతంగా గురువారం మంత్రాలయం వచ్చారు. మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. వీరి వెంట తహసీల్దార్ ఎస్ రవి, ఎస్ఐ పరమేష్ నాయక్ తదితరులు ఉన్నారు.



స్వర్ణపల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్రుడు

ఘనంగా బాలల దినోత్సవం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశ తొలి ప్రధాని నెహ్రూ జయంతిని పురస్కరించుకొని కర్నూలు నగరంలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశాన్నికి చేసిన సేవలను కొని యాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.రాజకుమారి, ఉప విద్యాశాఖ అధికారి హనుమంతురావు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషాద్రి

నాడు పీఎస్ నేడు ఐఏఎస్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- చిన్న ఉద్యోగం నుంచి ఉన్నత స్థాయికి..
- యువతకు స్ఫూర్తిగా ఆ అధికారి ప్రస్థానం
- ఈ విజయం అమ్మానాన్నలకు అంకితం
- ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి



కర్నూలు కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చిన్న ఉద్యోగంలో అడుగుపెట్టిన ఆమె నేడు ఐఏఎస్‌గా ఎంపికై అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేటి యువతకు తన ప్రస్థానం స్ఫూర్తిదాయకమని చాటి చెబుతున్నారు. పంచాయతీరాజ్ సెక్రటరీ నుంచి గ్రూపు-1 ఆఫీసర్‌గా, ఆ తరువాత ఐఏఎస్‌గా ఎంపికైన ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణిని ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విషయాలు వెల్లడించారు. 'అమ్మా నాన్నల ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి చేరుకున్నానని, ఈ విజయం వారికి సొంతమని చెబుతున్నారు. యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చని సూచిస్తున్నారు.

విద్యాభ్యాసం..

● మాది శ్రీకాకుళం జిల్లాలోని ఒప్పంగి. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను. నాన్న వ్యవసాయం తోపాటు కూలి పనులు చేసేవారు. అమ్మ గృహిణి. అమ్మా నాన్న ఏమీ చదువుకోలేదు. అయినప్పటికీ చదువు విలువ తెలుసుకుని మా అక్క చెల్లెలిని కూడా బాగా చదివించారు. మా మామయ్య ఇచ్చిన సలహాతో ఒక లక్ష్యం పెట్టుకున్నాను. ఆ లక్ష్యం ప్రకారమే సివిల్స్ లో 285 ర్యాంకు సాధించాను. ఒకటి నుంచి 10వ తరగతి వరకు శ్రీకాకుళం చదివాను. ఇంటర్మీడియట్ విశాఖపట్నంలో పూర్తి చేశాను. తర్వాత ఢిల్లీలోని శ్రీరామకళాశాలలో డిగ్రీ బీకాం పట్టా పొందాను.

పంచాయతీ సెక్రటరీ నుంచి..

● 2019 సంవత్సరంలో పంచాయతీ సెక్రటరీగా పని చేశాను. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి 2021లో గ్రూప్-1 పరీక్ష రాశాను. మొదటి సారే ఇందులో ఎంపికై విశాఖ ట్రెజరీలో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా పని చేశాను. ఈ ఉద్యోగం చేస్తూనే సివిల్స్ రాశాను. తొలి దఫాలోనే 285వ ర్యాంకు సాధించాను. ప్రస్తుతం శిక్షణలో భాగంగా ట్రైనీ కలెక్టర్‌గా కర్నూలుకు వచ్చాను. ప్రతి శాఖపై పట్టు సాధిస్తున్నాను.

నిరంతరంగా కృషి చేయాలి

● ఎవరైనా ఉన్నత స్థానానికి వెళ్లాలంటే ఒక గొప్ప లక్ష్యం ఏర్పరుచుకోవాలి. ప్రతి దశలోనూ ఆటంకాలు ఎదురవుతాయి. వాటిని ఎదుర్కొని ముందుకు వెళ్లాలి. మధ్యలో ఎక్కడా లక్ష్యాన్ని మర్చిపోరాదు. లక్ష్యం సాధించే వరకు నిరంతరం కృషి చేస్తూనే ఉండాలి. ప్రయత్నాలు చేసే కొద్ది విజయం సాధించగలుగుతారు. కొన్ని సందర్భాలలో విజయం సాధించలేకపోతున్నామని భయపడకూడదు. మంచి ప్రణాళిక ద్వారా ముందుకు వెళ్లాలి.

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నా..

● శిక్షణ నిమిత్తం ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలను సందర్శించాను అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటున్నాను. ఉన్నతాధికారులు ఆ సమస్యలను ఎలా పరిష్కారం అనేది గ్రహిస్తున్నాను.

రాఘవేంద్రా... గోడు వినవా..!

(5వ పేజీ తరువాయి)

గురురామవేంద్ర ప్రాజెక్టులో భాగంగా మూగలదొడ్డి, పులచింత, చిలకలడోణ, సోగనూరు, కృష్ణదొడ్డి, రేమట, మునగాల, కంబదహాల్, చింతమానుపల్లె ఎత్తిపోతల పథకాలు, 2005 మార్చి 23న ప్యాకేజీ-97 కింది రూ.65.21 కోట్లతో మాధవరం, బసలదొడ్డి, దుద్ది ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు లిఫ్టుల నిర్వహణ కోసం గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు ఓ అండ్ ఎం గ్రాంట్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రూ.15 కోట్లు కావాలని ఇంజనీర్లు ప్రతిపాదన. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు.. మూగలదొడ్డి, మాధవరం స్టేజ్-1, స్టేజ్-2, బసలదొడ్డి స్టేజ్-1, చిలకలడోణ స్టేజ్-1, స్టేజ్-2, సోగనూరు స్టేజ్-1, పులచింత స్టేజ్-1, స్టేజ్-2 ఎత్తిపోతల పథకాలు పంప్‌హౌస్‌లో దొంగలు పడి హెచ్‌టీ, ఎల్‌టీ ప్యానల్ బోర్డులు, స్టార్టర్లు, ప్యానల్ బోర్డులు ధ్వంసం చేసి విలువైన కాపర్ వైర్, కాయిన్స్, పవర్ ఆయిల్ దోచుకెళ్లారు. మరమ్మతులకు రూ.5.50 కోట్లు తక్షణమే ఇవ్వాలని ప్రతిపాదించారు. తాజాగా బడ్జెట్‌లో రూ.69 కోట్లు ఇచ్చారు. కష్టాలు తీరాయని ఆశిస్తే.. అందులో రూ.63 కోట్లు గత వైసీపీ ప్రభుత్వం పెట్టిపోయిన విద్యుత్ బకాయిలకు కేటాయించారు. మరో రూ.6 కోట్లు హెడ్ ఆఫ్ అకౌంట్ 351 మేజర్ పనులకే ఇచ్చారు. అంటే గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు మిగిలింది రూ.6 లక్షలే. మరమ్మతులు ఎలా చేయాలని ఇంజనీర్లు తలలు పట్టుకుంటున్నారు.

బకాయి రూ.35 కోట్లు.. ఇచ్చింది రూ.11.79 కోట్లు

గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం 4.500 టీఎంసీలు. కుడి, ఎడమ కాలువల ద్వారా గోనేగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ మండలాల పరిధిలోని 21 గ్రామాలకు 25,454 ఎకరాలు రబీ ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. జిల్లాల విభజన తర్వాత కర్నూలులో ఇదే అతిపెద్ద జలాశయంగా మిగిలింది. ఇక్కడి నుంచే డోన్, కృష్ణగిరి, బండగట్టు తాగునీటి పథకాలు ద్వారా డోన్ పట్టణం సహా వివిధ పల్లెలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణానికి కూడా నీటి సరఫరా కోసం పైపులైన్ పనులు చేపట్టారు. కర్నూలు నగరానికి దాహం తీర్చే జీవనాడిగా మారింది. సాగు, తాగునీటి అవసరాలు దృష్ట్యా గత వైసీపీ ప్రభుత్వం నీటి సామర్థ్యం 5.5 టీఎంసీల(అదనంగా ఒక టీఎంసీ)కు పెంచుతూ రూ.57 కోట్లతో పనులు చేపట్టారు. మరో రూ.12 కోట్లతో ఆరు కొత్త క్రస్ట్‌గేట్లు ఏర్పాటు పనులు చేపట్టారు. 75 శాతం పనులు పూర్తి అయ్యాయని ఇంజనీర్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు దాదాపు రూ.35 కోట్లు బకాయి పెడితే ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తి బకాయిలు చెల్లిస్తుందని ఆశిస్తే.. బడ్జెట్‌లో కేవలం రూ.11.79 కోట్లు కేటాయించారు. అందులోనే నిర్వహణ కూడా చేపట్టాలి. జీడీపీ అసంపూర్తి పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



అసంపూర్తిగా గాజులదిన్నె ప్రాజెక్టు మట్టికట్ట ఎత్తు పనులు



పందికోన రిజర్వాయరు దుస్థితి ఇది

భూ సేకరణకు నిధులేవి..?

ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు అందించాలని 2019 జనవరిలో రూ.1,942.38 కోట్లతో వేదవతి ప్రాజెక్టు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోనే 40 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంగా 2019 జనవరిలో జీవో ఆర్టీ నం.76 జారీ చేసి రూ.1,985.42 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలువ పనులు గత టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) హెడ్ ఆఫ్ అకౌంట్ కిందే ఈ పనులు చేపడుతున్నారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం రావడంతో కరువు రైతుల్లో ఆశలు చిగురించాయి. అయితే బడ్జెట్‌లో నిధులు ఎండమావులుగా మారాయి. ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్ మూడు ప్రాజెక్టులకు ఇచ్చింది కేవలం రూ.13 కోట్లే. అందులో ఆర్డీఎస్ బకాయిలు దాదాపు రూ.10 కోట్లు ఉన్నాయని ఇంజనీర్లు అంటున్నారు. వేదవతి ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలంటే భూ సేకరణకు తక్షణం రూ.56 కోట్లు కావాలి. ఆర్డీఎస్‌కు కూడా దాదాపు రూ.55 కోట్లు కావాలి. అంటే వచ్చే 2025-26 బడ్జెట్‌పైనే ఆశలు పెట్టుకోవాలి. హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పత్తికొండ (పందికోన) రిజర్వాయర్, కుడి, ఎడమ కాలువల అసంపూర్తి పనులకు రూ.200 కోట్లు కావాలని ఇంజనీర్లు ప్రతిపాదించారు. బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు స్పందించి సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులపై ఒత్తిడి తీసుకొచ్చి అడిషనల్ గ్రాంట్ రూపంలో నిధులు రాబట్టాలని జిల్లా రైతాంగం కోరుతోంది.

వేదవతి, గుండ్రేవుల పూర్తి చేస్తాం

- కరువు, వలసల నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- శాసన మండలిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు

కర్నూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వేదవతి ప్రాజెక్టు, గుండ్రేవుల జలాశయం నిర్మాణాలు పూర్తి చేస్తామని, పశ్చిమ ప్రాంతంలో కరువు, వలసల నివారణకు టీడీపీ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం శాసన మండలిలో వివరించారు. జిల్లా ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ.. 2019 జనవరిలో గత టీడీపీ ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1,942 కోట్లు నిధులు మంజూరు చేసిందని, పాలనాపరమైన అనుమతులు, టెండర్లు కూడా పూర్తి చేసి పనులు చేపట్టామని వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2019-24లో బడ్జెట్‌కు పాలనపరమైన అనుమతులు ఉన్నా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. 4,819 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉంటే కేవలం 9 ఎకరాలే సేకరించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్ట్ ఏజెన్సీ మేఘా కంపెనీ పనులు ఆపేసిందని తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టిందని, భూ సేకరణకు రూ.384 కోట్లు, సివిల్ వర్క్స్, పైపులైన్లు, జలాశయాలు, గ్రావిట్ కెనాల్, పంప్‌హౌస్ నిర్మాణాలకు రూ.1,452 కోట్లు అవసరమని గుర్తించామని చెప్పారు. సుంకేసుల బ్యారేజీ ఎగువన తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంలో గుండ్రేవుల జలాశయం నిర్మాణం కోసం 2019 ఫిబ్రవరిలో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.2,890 కోట్లు కేటాయించి, డీపీఆర్ తయారు చేసిందన్నారు. ఈ జలాశయం నిర్మాణం చేయాలంటే ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి 23 వేల ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. అంతర్ రాష్ట్ర ప్రాజెక్టు కావడంతో ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పంపామన్నారు.



ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్

ఈ. తాండ్రపాడులో ప్రారంభించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ



క్యాన్సర్ స్క్రీనింగ్‌ను ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

కర్నూలు హాస్పటల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 18 ఏళ్ల వయసు పైబడిన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే క్యాన్సర్ 3.0 స్క్రీనింగ్ పరీక్షలను డీఎం అండ్‌హెచ్‌ఓ డా.ఎల్. భాస్కర్ ప్రారంభించారు. ఈ మేరకు కర్నూలు మండలంలోని ఈ. తాండ్రపాడు పీహెచ్‌సీలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎన్‌సీడీ నోడల్ అధికారి హేమలతతో కలిసి స్క్రీనింగ్ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ హైపర్ టెన్షన్, డయాబెటిక్, సాధారణ క్యాన్సర్ గురించి రోగులకు అవగాహన కల్పించాలని అన్నారు. మహిళలు, గర్భిణుల స్క్రీనింగ్ వివరాల్లో గోప్యత కచ్చితంగా పాటించాలని సూచించారు. మధుమేహం, బీపీ, గుండె వ్యాధులు, పక్షపాతం, మూత్రపిండాల వ్యాధులు, ఊపిరితిత్తులు వ్యాధులతో బాధపడుతున్న వారిని సమీపంలోని పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్‌కు రెఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈ. తాండ్రపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. మంజూష, డా. జి. వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సినీనటుడు పోసానిపై పోలీసులకు ఫిర్యాదు



ఆలూరులో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

ఆలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు పోసాని మురళీ కృష్ణపై కేసు నమోదు చేయాలని ఆలూరు మండల టీడీపీ కన్వీనర్ అశోక్ యాదవ్ కోరారు. గురువారం ఆలూరు పోలీసులకు పోసాని మురళీకృష్ణపై ఫిర్యాదు చేశారు. సమాజానికి సేవ చేస్తున్న టీటీడీ చైర్మన్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు.. ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు రాము యాదవ్, వెంకటేష్, హోతురప్ప పాల్గొన్నారు.

త్రీటౌన్‌లో టీడీపీ నాయకుల ఫిర్యాదు

కర్నూలు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు, వైసీపీ నేత పోసాని క్రిష్ణమురళిపై ఫిర్యాదు చేశారు. గురువారం నగరంలోని త్రీ టౌన్ సీఐ శేషయ్యకు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, టీడీపీ లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ ప్రసాద్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, మైనార్టీ సెల్ నాయకులు ఎస్‌కే షేక్ బషీర్ అహ్మద్, జనసేన రాయలసీమ నాయకులు పవన్ కుమార్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఆదోనిలో కేసు నమోదు

ఆదోని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పోసాని కృష్ణమురళిపై ఆదోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై జనసేన పట్టణ అధ్యక్షుడు రేణువర్మ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై తీవ్ర అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు, సోషల్ మీడియాలో పోస్టు చేశారని, అంతేకాకుండా, గతంలో హైదరాబాద్ జరిగిన ప్రెస్‌మీట్‌లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు చేశారు. జనసేన నాయకులు ఇచ్చిన ఫిర్యాదుతో పోసాని కృష్ణమురళిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

హైకోర్టు సీమవాసుల హక్కు

- హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త తరలింపుతో సీమకు ద్రోహం
- రాయలసీమ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ వై. జయరాజు



కర్నూలు లీగల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం మేరకు కర్నూలులో వెంటనే హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని, ఇది సీమవాసుల హక్కు అని రాయలసీమ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ వై. జయరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటన జారీ చేస్తూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఒక తీర్మానం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఎన్నికల వాగ్దానంలో పేర్కొన్నారని, అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా ఇంకా కార్యరూపం దాల్చలేదని ఆయన విమర్శించారు. రాయలసీమకు హైకోర్టు తరలింపునకు బీజేపీ, జనసేన పార్టీలు సుముఖంగా ఉన్నా కూడా టీడీపీ మౌనంగా ఉండటం సీమవాసుల్లో ఆగ్రహం పెరిగిపోతోందని ఆయన తెలిపారు. మరోవైపు ఇదివరకే కర్నూలులో పనిచేస్తున్న మానవ హక్కుల కమిషన్, లోకాయుక్తలను కూడా విజయవాడకు తరలించి రాయలసీమకు ద్రోహం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్తలను కర్నూలులోనే కొనసాగించాలని కోరారు.

పోక్సో కోర్టు పీపీగా వై. ప్రకాశ్ రెడ్డి

కర్నూలు పోక్సో కోర్టు పీపీగా న్యాయవాది వై. ప్రకాశ్‌రెడ్డిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఆదేశాలు జారీ చేసింది. ఇంతవరకు ఈయన నిర్వహిస్తున్న నాలుగవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పీపీ బాధ్యతలతోపాటూ పోక్సో కోర్టు పీపీ బాధ్యతలను కూడా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు కొనసాగించాలని పేర్కొన్నారు.

డీసీఆర్‌బీ తనిఖీ

కర్నూలు క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని డీసీఆర్‌బీ కార్యాలయాన్ని ఎస్పీ బిందుమాధవ్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. డీసీఆర్‌బీలోని అన్ని విభాగాలకు చెందిన రికార్డులను ఆయన పరిశీలించారు. రౌడీలు, కేడీలు, అనుమానితుల పేర్లు ఉన్న రిజిస్టర్లను పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐలు ప్రసాద్, గుణశేఖర్, రామయ్య నాయుడు ఉన్నారు.



డీసీఆర్‌బీ తనిఖీ చేస్తున్న ఎస్పీ

బీపీఈడీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. రెగ్యులర్ 85 మందికి 79, సప్లిమెంటరీకి 16 మంది పరీక్షలు రాయగా 15 మంది ఉత్తీర్ణత సాధించారని పరీక్షల విభాగం అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధిపై కేసు నమోదు



ఫిర్యాదు చేస్తున్న ఐ-టీడీపీ నాయకులు

ఆదోని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధిపై గురువారం ఆదోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతపురానికి చెందిన జింకల రామాంజినేయులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోపాటు, మంత్రి నారా లోకేశ్ మీద అనుచిత వ్యాఖ్యలు చేశాడు. అలాగే అసభ్యకరమైన ఫొటోలు క్రియేట్ చేసి సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేశాడు. దీంతో అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదోని ఐ-టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎస్.సజ్జాద్ హుస్సేన్‌తో పాటు ఐ-టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బీ అంజినమ్మలు త్రీటౌన్ సీఐ రామలింగమయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి జింకల రామాంజినేయులుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రూ.20 కోట్లు ఇస్తామని మోసం

- నలుగురు నిందితుల అరెస్టు



అరెస్టు చూపిస్తున్న టూ టౌన్ సీఐ, ఎస్‌ఐలు

కర్నూలు క్రైం , నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఫండ్ నుంచి రూ.20 కోట్లు ఇస్తామని, అందుకు గాను జీఎస్‌టీ కింద రూ.15 లక్షలు చెల్లించాలని నమ్మించే ప్రయత్నం చేసిన ఓ ముఠాను టూ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. నిందితులు హరీష్, భానుప్రతాప్, ప్రతాపరెడ్డి, శ్రీధర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నాగరాజా రావు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా సిద్దవరం గ్రామానికి చెందిన సోమశేఖర్‌కు బెంగళూరుకు చెందిన హరీష్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తనకు విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్ లాంటి పెద్ద కంపెనీలతో పరిచయాలు ఉన్నాయని నమ్మించాడు. ఏదైనా ఫ్యాక్టరీ, ట్రస్టు లాంటివి ఉంటే ఈ కంపెనీల నుంచి రూ.20 కోట్లు అప్పుగా ఇప్పిస్తానని, అందుకు గాను రూ.15 లక్షలు జీఎస్‌టీ కింద చెల్లించాల్సి ఉంటుందని నమ్మించాడు. ఇది నిజమని నమ్మిన సోమశేఖర్ తన మిత్రుడు బసవరాజుతో కలిసి హరీష్ డీల్‌కు సరేనన్నాడు. బుధవారం హర్ష అనే వ్యక్తి వీరికి ఫోన్ చేసి కర్నూలు రాజ్ విహార్ లాడ్జికి రావాలని, అక్కడ రూ.15 లక్షలు ఇస్తే వెంటనే రూ.20 కోట్లు మీ ఖాతాలో జమ చేస్తానని చెప్పాడు. సోమశేఖర్, బసవరాజు ఇద్దరూ కలిసి బుధవారం రాత్రి కర్నూలు రాజ్‌విహార్ లాడ్జికి వచ్చారు. అప్పటికే లాడ్జి గదిలో నిందితులు నలుగురు ఉన్నారు. వారి మాటలను బట్టి తమను మోసగిస్తున్నారని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు లాడ్జికి వచ్చేసరికి అప్పటికే ఇద్దరు నిందితులు తప్పించుకున్నారు. పోలీసులు అప్రమత్తమై పారిపోయిన ఇద్దరితోపాటు లాడ్జిలోని ఇద్దరిని పట్టుకొని వారి వద్ద నుంచి మహీంద్రా కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

గ్రంథాలయాల పురోభివృద్ధికి సహకరిస్తా

ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రంథాలయాల పురోభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ నాగరాజు తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి, గ్రంథాలయ ఉద్యమానికి కృషిచేసిన మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా ఎందరో విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావచ్చని చెప్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు కల్పించిన ఏర్పాట్లను ఆయన అభినందించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తే విద్యార్థుల్లో చైతన్యం పెరుగుతుందని అన్నారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేసీ కల్కూర, కేజీ గంగాధర్‌రెడ్డి, ముచ్చుకోట చంద్రశేఖర్, కార్యదర్శి కె. ప్రకాశ్, ఉప గ్రంథాలయ అధికారి వి. పెద్దక్క, గ్రంథాలయ అధికారులు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్ బాషా పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చేనేత కార్మికుడు మృతి

ఎమ్మిగనూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్‌ఎంటీ కాలనీలో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ సభ్యుడు జక్కా వెంకట్రామప్ప (95) వయోభారంతో గురువారం వేకువ జామున మృతి చెందారు. వెంకట్రామప్ప 20 ఏళ్ల వయస్సు నుంచే నేత పని చేసేవారు. దివంగత పద్మశ్రీ మాచాని సోమప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ దివంగత మాచాని శివణ్ణ కుటుంబానికి నమ్మిన వ్యక్తిగా మెలిగారు. ఆయన మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న పలువురు చేనేత కార్మికులు, సొసైటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



బాలగంగాధర్ రెడ్డి (ఫైల్)

ఓర్వకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై హుస్సేనాపురం బస్టాండు సమీపంలో గురువారం జరిగిన రహదారి ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్సై సునీల్ కుమార్ కథనం మేరకు.. మండలంలోని శకునాల గ్రామానికి చెందిన బాలగంగాధర్‌రెడ్డి(48) సొంత పని నిమిత్తం హుసేనాపురం వచ్చి బస్టాండు వద్ద రోడ్డు దాటుతుండగా నంద్యాల వైపు వెళుతున్న లారీ అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలగంగాధర్‌రెడ్డి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతుడు గ్రామంలో డిష్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మృతునికి భార్య విజయమ్మ, కుమారులు ప్రవీణ్, నవీన్ ఉన్నారు. పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. గ్రామంలో భక్తిభావం, మంచితనం, అందరితో కలుపుగోలుగా మెలిగే బాలగంగాధర్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేడీసీసీ బ్యాంక్ మాజీచైర్మన్ మల్లికార్జునరెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు మౌళీశ్వరరెడ్డి, హరి, పుల్లయ్య, గ్రామస్తులు బాలగంగాధర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపడి మహిళకు తీవ్ర గాయాలు

ఆదోని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : హొళగుంద మండలం గజ్జెహళ్లి గ్రామంలో పిడుగుపడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గజ్జెహళ్లికి చెందిన అనసూయ పంట చేలో కలుపు తీస్తుండగా వర్షం పడింది. దీంతో ఆమె చెట్టు కిందకు వెళ్లింది. అదే సమయంలో మెరుపులు, ఉరుములతో కూడిన వర్షంతో పాటు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో కూడిన పిడుగు పడింది. దీంతో అనసూయ తీవ్ర గాయాలతో కిందపడిపోయింది.. ఆమెను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న కారణంగా కర్నూలుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

హిందూపురం ఎమ్మెల్యేను కలిసిన తుగ్గలి నాగేంద్ర



తుగ్గలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర గురువారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిలో హిందుపూర్ ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసి పత్తికొండ ప్రాంత సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. అలాగే భవిష్యత్తులో పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపామని చెప్పారు. తన సమస్యలను కూడా తెలిపామని, వాటన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో సర్పంచ్ అరెస్టు

ఇద్దరు కార్యకర్తలు కూడా..



నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ

కోసిగి, నవంబరు (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని అత్యాచారయత్నం కేసులో వైసీపీ సర్పంచ్ బోయ ఉసేనితో పాటు వైసీపీ కార్యకర్తలు వినోద్, మజ్జిగ సూర్యనారాయణలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ మంజూనాథ్, ఎస్‌ఐ చంద్రమోహన్ మాట్లాడుతూ నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించారని అన్నారు. మండలంలో ఎవరైనా ఇలాంటి ఘటనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుండెపోటుతో మహిళా రైతు మృతి

కోసిగి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో మహిళా రైతు దుద్దిలక్ష్మి (49) గురువారం మృతి చెందింది. ఛాతిలో మంటగా ఉండటంతో భర్త చిన్నారెడ్డి ఆమెను కోసిగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

మూడు మద్యం దుకాణాల్లో చోరీ

రూ.5 లక్షలు, మద్యం ఎత్తుకెళ్లిన దొంగలు



మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఆదోని, కర్నూలు బైపాస్ రోడ్డులో ఉన్న మూడు మద్యం దుకాణాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మద్యం దుకాణాల పై కప్పులను కత్తిరించి లోపలకు చొరబడ్డారు. అనంతరం దుకాణాల్లో ఉన్న డబ్బు, మద్యంను ఎత్తుకెళ్లారు. పట్టణంలోని ఎద్దుల మార్కెట్‌కు ఎదురుగా ఓ షెడ్డులో నిర్వహిస్తున్న మద్యం దుకాణం పైభాగంలో రేకులను కోసి దుకాణంలో ఉన్న రూ. 3.50 లక్షలు ఎత్తుకెళ్లారు. అలాగే ఆదోని రోడ్డు వెంకటాపురం అడ్డ రోడ్డు సమీపంలో ఉన్న మరో మద్యం దుకాణంలో సైతం రేకులను కత్తిరించి లోపలకు దిగి రూ. 1.80 లక్షలను దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే లక్ష్మణ్ సినిమా థియేటర్ సమీపంలో ఉన్న మరో మద్యం దుకాణంలో సైతం పైభాగంలో రేకులను కత్తిరించారు. ఇక్కడ మాత్రం కొంత మేర మద్యం ఎత్తుకెళ్లారు. ఇలా ఒకే రోజు మూడు మద్యం దుకాణాల్లో దొంగతనం జరగడంతో పట్టణంలో కలకలం రేగింది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ శ్రీనివాసులు సిబ్బందితో చోరీ జరిగిన మద్యం దుకాణాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌యూలో ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూని వర్సిటీలో ఆర్‌పీఎస్‌ఎఫ్(రాయలసీమ పరిరక్షణ సమితి స్టూడెంట్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో గురువారం బీటెక్ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ రిజిస్ట్రార్ విజయకుమార్‌లు హాజరై ప్రసంగించారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను చేజార్చుకోవద్దని అన్నారు. విద్యార్థులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. యూనివర్సిటీలో వైఫై సౌకర్యం కల్పించాలని, క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి జె మోహన్ అన్నారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో గూడూరులోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జె మోహన్ మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ చార్జీల వసూళ్లు నిలివేయాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ఉచిత ఇసుక అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, మాధవక్రిష్ణయ్య, రామాంజనేయులు, మధు, మల్లికార్జున, మద్దిలేటి, సురేష్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఎం నాయకుడు రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ చేనేతలకు 200 యూనిట్లు కరెంటును ఉచితంగా అందించాలని, రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు, తల్లికి వందనం కింద తల్లుల అకౌంట్లలోకి రూ.15వేలు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు రూ.1500. నిరుద్యోగ భృతి కింద నిరుద్యోగులకు రూ.3వేలు అందించాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో పెంచనున్న కరెంటు బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీపీ వీరన్న, బుడ్డప్ప, గిడ్డయ్య, ముని స్వామి, శంకర్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పెద్దపాడు సమీపంలోని ఆదర్శ పాఠశాల పక్కన చేపడుతున్న బీరప్పస్వామి ఆలయ నిర్మాణానికి ఎర్రకోటకు చెందిన కురువ అంపయ్య, జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామికి రూ50వేలు నగదు గురు వారం అందజేశారు. కార్యక్రమంలో నాయకలు టి.పాల సుంకన్న, బి.వెంక టేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వృద్ధురాలు మృతి

గూడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చనుగొండ్ల సమీపంలోని కేసీసీ కాలువలో పడి గురువారం వృద్ధురాలు మాంతమ్మ(71) మృతి చెందింది. కోడుమూరుకు చెందిన మాంతమ్మ మతిస్థిమితం లేక తిరుగుతూ ఉండేదని ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చి గురువారం చనుగొండ్ల సమీనంలో కాలువలో పడి మృతి చెందిందని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు.





కాంగ్రెస్ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కోల్స్ ఉన్నత పాఠశాలలో.. పంచలింగాల మాంటిస్సోరి ఒలంపస్ పాఠశాలలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

ఘనంగా బాలల దినోత్సవం

కర్నూలు కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కోల్స్ ఉన్నత పాఠశాల్లో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం హెచ్‌ఎం ఆర్‌పీ రాజా రావు అధ్యక్షతన జరిగింది. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళి అర్పించారు. పూర్వ విద్యార్థులు కోల్స్ ఫౌం డేషన్ అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు పి.విజయకుమార్, ఎస్‌సీఐ మేనేజర్ పి.సంపత్‌కుమార్, ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ డేవిడ్, పాస్టర్ ఎస్‌జే సజీవరావు, కోల్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జయకుమార్, అల్బర్ట్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరాశాంతి, పూర్వ విద్యార్థులు, పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: దేశ ప్రజాస్వామ్య సౌధానికి నిర్మాత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్‌బాబు, పార్లమెంట్ ఇన్‌చార్జి పీజీ రాంపుల్లయ్య, నగర అధ్య క్షుడు షేక్ జిలానీ, షేక్ ఖాజా హుస్సేన్, అనంతరత్నం మాదిగ, వెంకట సుజాత, బజారన్న, ప్రమీల పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: నగర శివారులోని పంచలింగాల మాంటిస్సోరి ఒలంపస్ పాఠశాలలో బాలల దినోత్సవం గురువా రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏకపాత్రా భినయం, స్కిట్‌లు, పాటలు, నెహ్రూ జీవిత చరిత్ర లోని కొన్ని ఘట్టాలను విద్యార్థులు ప్రదర్శించారు. మాంటిస్సోరి విద్యా సంస్థల వ్యవస్థాపకురాలు కళ్యాణమ్మ నాటిక ద్వారా జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో వెల్కమ్, కొరియన్, పిరమిడ్, యోగా డ్యాన్స్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్ర మంలో పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రవిప్రకాష్, ప్రిన్సిపాల్ నాగ లక్ష్మీ, సిద్ధార్థ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో.. నగరంలోని శ్రీనగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డీన్ హుసేన్ బాషా, ప్రిన్సిపాల్ సుహా సిని ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: నగరంలో అఖిల భారత యువజన సమైఖ్య(ఏఐవైఎఫ్) అధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం బుధవారపేటలోని అనాథ ఆశ్రమం లో కేక్ కట్ చేసి చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈసం దర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరిం చుకుని దేశవ్యాప్తంగా బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్నా మన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బీసన్న, సభ్యులు రాజు పాల్గొన్నారు.

● విద్యార్థులంతా చదువులో రాణించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రొ చైల్డ్ రీజినల్ కన్వీనర్ బత్తుల చిన్నయ్య అన్నారు. జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం అధ్వర్యంలో గురు వారం నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం క్రాఫ్ట్ అడ్వకేసి ఫౌండే షన్ సహకారంతో తయారు చేసిన పోస్టర్‌ను సీడబ్ల్యూసీ సభ్యులు పి.సంజీవరెడ్డి, మురళీకృష్ణ విడుదల చేశారు. ఆటలు, పాటలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫోరం రైట్స్ అధ్యక్షుడు విజయరాజు, ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రంలోని స్పెషల్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ప్రధా నోపాధ్యా యులు కిశోర్‌కుమార్, ఉపాధ్యాయులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్థానిక గ్రంథాయలంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఎంఈవో ఆదాంబాషా గ్రంథాలయాల వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు రమణ, టీడీపీ మాజీ మండల కన్వీ నర్ తిమ్మప్ప, ధనంజయుడు, బాలాజీ వెంకటేశ్, గౌస్ పాల్గొన్నారు.



శ్రీచైతన్య పాఠశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్



సి.బెళగల్‌లో..



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఫోరం సభ్యులు

క్రమబద్ధ జీవనంతోనే మధుమేహం దూరం

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రమబద్ధ జీవనంతోనే మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ అన్నారు. గురువారం వరల్డ్ డయాబెటిక్ డే సందర్భంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓల్డ్ సీఎల్‌బీలో ఎండోక్రైనాలజీ విభాగం ఆధ్వర్యంలో నర్సులకు మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సును ప్రిన్సిపాల్, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డయాబెటిక్ రోగుల సంరక్షణలో నర్సింగ్ సేవలు కూడా ముఖ్యమన్నారు. ఎండోక్రైనాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మధుమేహానికి పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయని, రోగులు క్రమం తప్పకుండ మందులు వాడి షుగర్ పరీక్షలు రెగ్యులర్‌గా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎండోక్రైనాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లం తిన్నా మధుమేహం వస్తుంది: పంచదార బదులు బెల్లం, కలకండ తిన్నా మధుమేహం వస్తుందని ఎండ్రోక్రైనాలజిస్టు హెచ్‌వోడీ ప్రొఫెసర్ పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం పెద్దాసుపత్రిలో వరల్డ్ డైయాబెటిక్ డే సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధికా రాణితో కలిసి నర్సింగ్ బీఎస్సీ, జీఎన్‌ఎం నర్సింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గర్భిణులకు షుగర్ ఉంటే మాత్రలు వాడాలా లేదా ఇన్సులిన్ ఇవ్వాలా అని అడిగారు. ఈ ప్రశ్నకు ఆయన సమాధాన ఇస్తూ కేవలం ఇన్సులిన్ మాత్రమే వాడాలని సూచించారు. వంశపారంపర్యంగా షుగర్ వస్తుందా అన్న విద్యార్థుల ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. తల్లిదండ్రులకు మధుమేహం ఉంటు పిల్లలకు 90 శాతం వస్తుందని తెలిపారు. అదే తల్లిదండ్రుల్లో ఒకరికి మాత్రమే ఉంటే వారి పిల్లలకు 70 శాతం వచ్చే అవకాశం ఉందని వివరించారు. షుగర్ లెస్ స్వీట్లు అసలు తినకూడదని, ఆ పదార్థాల్లో కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయని, అవి తింటే చక్కెర స్థాయి పెరుగుతుందని చెప్పారు.



నర్సింగ్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎండ్రో క్రైనాలజిస్టు

మెడికవర్ ఆసుపత్రిలో : ఆరోగ్యకరమైన జీవనశైలితోనే డయాబెటీస్‌ను నివారించవచ్చని కర్నూలు మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జయ క్రిష్ణమూర్తి, నెఫ్రాలజిస్టు డాక్టర్ సిద్ధార్థ్ హెరూర్ అన్నారు. గురువారం వరల్డ్ డయాబేటిక్ డే సందర్భంగా హస్పటల్‌లో ఏర్పాటు చేసిన రోగుల అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి కర్నూలు క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

జేమ్ కేర్ కామినేని ఆస్పత్రిలో: నగరంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న జేమ్ కేర్ కామినేని హాస్పిటల్‌లో గురువారం వరల్డ్ డయాబెటిక్ డే సందర్భంగా ప్రత్యేక సదస్సు నిర్వహించారు. హాస్పిటల్ సీఈవో డయాబెటాలజిస్టు సీనియర్ ఫిజిషియన్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమలేకపోవడం వల్ల 20 నుంచి 30 ఏళ్లకే సుగర్ వస్తోందన్నారు. ప్రతి నెలా రెగ్యులర్‌గా ఈ పరీక్షలు చేయించుకుని వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ రవీబాబు, డా రాఘవేంద్ర, ఆపరేషన్ హెడ్స్ పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలపై అవగాహన

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి ఆవకాశాలపై ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అధ్యక్షతన అవగా హన కార్యక్రమము జరిగింది. ముందు నెహ్రూ చిత్రపటానికి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంపాయిమెంట్ అధికారి పి. దీప్తి మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు సెట్విూర్ ద్వారా ఇచ్చే శిక్షణలను పొంది, ఉద్యోగ, ఉపాధి ఆవకాశాలు పొందాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ దేశం అభివృద్ధి సాధించడానికి నెహ్రూ ప్రవేశ పెట్టిన పంచవర్ష ప్రణాళికలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



ఓర్వకల్లులో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఓర్వకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన వికాసానికి వేదికలని ఓర్వకల్లు, నన్నూరు గ్రంథాలయాధికారులు హనుమే నాయక్, కౌసల్య అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఓర్వకల్లు, నన్నూరు గ్రంథాలయాల్లో ప్రారంభమయ్యాయి. ముందుగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమా లలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలోని గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం గ్రంథాలయాధికారి మధు నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. గ్రంథాలయంలో బాలల దినోత్సవం సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో సునీలమ్మ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మాంటిస్సోరీలో క్రీడా పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఓటమిని దీటుగా ఎదుర్కొని విజయం వైపు అడుగులు వేయాలని డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. గురువారం స్థానిక మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఇంటర్ స్కూల్ బ్యాండ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిరంతర సాధనతో తప్పక విజయవకాశాలను చేరుకుంటారన్నారు. బాయ్స్ పైప్ బ్యాండ్ విభాగంలో వెస్ట్ గోదావరి ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాల ప్రథమ బహుమతి, కర్నూలు మాంటిస్సోరి పాఠశాల రెండో బహుమతి సాధించాయి. అలాగే, బాయ్స్ బ్రాస్ విభాగంలో కర్నూలు మాంటిస్సోరి పాఠశాల ప్రథమ బహుమతి, తిరుపతి వెరిటాస్ సైనిక్ స్కూల్ రెండో బహుమతి కైవసం చేసుకుంది, అలాగే బాలికల పైప్ విభాగంలో కర్నూలు మాంటిస్సోరి పాఠశాల విజయం సాధించింది. కార్యక్రమంలో మాంటిస్సోరి పాఠశాలల డైరెక్టర్ కేఎస్‌వీ రాజశేఖర్, డీఈఓ శ్యామ్యూల్‌పాల్ కడప ఆర్జేడీ సామేల్, రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రామకృష్ణ, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి భాను మూర్తి రాజు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీతోనే నాయీబ్రాహ్మణులకు న్యాయం

కర్నూలు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే నాయీ బ్రాహ్మణులకు న్యాయం జరుగుతుందని కార్పొరేషన్ డైరెక్టర్ పాలక వీటీ విజయకుమార్ అన్నారు. గురువారం మంత్రి నారా లోకేశ్‌ను పాలక వీటీ విజయకుమార్ కలిసి ధన్యవాదాలు తెలిపారు. నాపై నమ్మకంతో కార్పొరేషన్ డైరెక్టర్ పదవీ ఇచ్చారని తెలిపారు. నాయీ బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు.



మంత్రి లోకేశ్‌తో నాయీబ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్

కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కర్నూలులోని కేసీ కెనాల్ వినాయక్ ఘాట్ వద్ద కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు చేశారు. కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉచితంగా దీపాలను పంపిణీ చేయనున్నామని కమిటీ ప్రతినిధులు ఇ.పద్మావతి, జె.రాధిక, ఇ. మల్లికార్జున రెడ్డి, కల్కి మురళి తెలిపారు. నగరంలోని సంకల్ బాగ్‌లోగల హరహర క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతాలు, కార్తీక దీపోత్సవాలు చేపట్టినట్లు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు.



ఓపీ కౌంటర్ తనిఖీ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డిజిటల్ ఓపీ కౌంటర్లతోపాటు ఇతర ఓపీ కౌంటర్లను సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులు ఈ డిజిటల్ ఓపీ కోసం ఆధార్, ఎన్టీఆర్ వైద్య సేవ కార్డు, మొబైల్ నెంబరు తప్పనిసరిగ్గా తీసుకుని రావాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణలోని ఓపీ కోసం రోగుల రద్దీ దృష్ట్యా ఈ-డిజిటల్ ఓపీ కౌంటరు, ఇతర కౌంటర్లను త్వరగా ఓపీ ఇచ్చే విధంగా చూడాలని ఈ హాస్పిటల్ నోడల్ ఆఫీసర్ డా.శివబాల, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయిని ఆదేశించారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ నోడల్ ఆఫీసర్ సునీల్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కర్నూలు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఇన్‌చార్జి ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో పీజీ విద్యార్థులకు నిర్వహించిన వివిధ ఆటల పోటీ లను రిజిస్ట్రార్ బి. విజయ కుమార్ నాయుడుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్ శివ కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఓర్వకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నమడకల గ్రామంలోని రాములవారి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకుడు, దాత బొల్లవరం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖ రొరెడ్డి సోదరుడు బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్ర మంలో తహసీల్దార్ విద్యాసాగర్, విద్యుత్ ఏఈ సునీల్ కుమార్, జడ్పీటీసీ రంగనాథ్‌గౌడ్, టీడీపీ నాయకుడు సుధాకర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు బి.శ్రీనివాసులు, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, ఎన్.శ్రీనివాసులు తదితరులు పాల్గొ న్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.42,82,600

గూడూరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కె.నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారి ఆలయం హుండీ ఆదాయం రూ.42,82,600 వచ్చినట్లు ఆలయ ఈవో నరసయ్య తెలిపారు. గురువారం మండలంలోని కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈవో నరసయ్య ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో పెరవల్లి ఈవో వీరయ్య, ఆలయ సిబ్బంది కేశవ, గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు

కర్నూలు కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో అత్యవసర పనులకు ప్రాధాన్యతనిస్తూ, అన్ని వార్డులకు సమాంతరంగా నిధులు కేటాయిస్తున్నామని నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం నగరపాలక కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. కమిషనర్ ఎస్ రవీంద్రబాబు, సభ్యులు ఎం. విక్రమసింహారెడ్డి, మిద్దె చిట్టెమ్మ, క్రాంతి కుమార్, జుబేర్, యూనుస్, అధికారులు హాజరయ్యారు. సాధారణ నిధుల నుంచి రూ.3,81,43,000 నిధులను ఖర్చు చేయడానికి ఆమోద ముద్ర వేశారు. 9 వార్డుల్లో అభివృద్ధి పనులు, క్లాప్ ఆటో డ్రైవర్లకు మరో నాలుగు నెలల బకాయిల వేతనాల చెల్లింపులు తదితర అంశాలు కీలకంగా ఉన్నాయి. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, మేనేజర్ ఎన్. చిన్న రాముడు, ఆరోగ్య అధికారి విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ జి. రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్, ఆర్‌ఓ జునైద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సి.బెళగల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమాల గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొం దుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 6వ తేదీన ముడుమాల, కొండాపురం గ్రామాల మధ్య దున్నపోతులు పొట్లాడుకుంటూ రవిని పొడవడంతో గాయాలయ్యాయి. అతడిని కర్నూలుకు ప్రభుత్వ ఆస్ప తికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉచిత వైద్య పరీక్షలు వినియోగించుకోవాలి

కోడుమూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యాధికారులు ఇంటింటికీ తిరుగతూ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచు భాగ్యరత్న అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో వైద్యాధికారులతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు శ్రీమంత్ మాదన్న, నరసప్ప, కమాల్ సాహెబ్, ఉమాబాయి, సామాజిక కార్యకర్త ఆంధ్రయ్య పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరిలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలను సర్పంచ్ పట్టె హనుమంతు, ఎంపీపీ రూతమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే మంచి వైద్యం పొంది విముక్తి పొందవ చ్చని అన్నారు. వైద్యాధికారి డాక్టర్ భాస్కర్, సీహెచ్‌వో శాంత, హెల్త్ ఎడ్యుకే టర్ శ్రీనివాసయాదవ్, సూపర్ వైజర్ శారద పాల్గొన్నారు.

సంకల్‌బాగ్ సుందరీకరణతో సరికొత్త శోభ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సంకల్‌బాగ్‌ను సుందరీకరించి సరికొత్త శోభ తీసుకువస్తామని కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. గురువారం ఆయన అధికారులతో కలిసి సంకల్‌బాగ్, బుధవారపేట ప్రాంతాలలో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ సంకల్‌బాగ్ వద్ద తుంగభద్ర నది తీరాని బంక్ రోడ్డు విస్తరణ, వాకింగ్ ట్రాక్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం 15వ వార్డు బుధవా రపేటలో జరుగుతున్న గ్రావెల్, వాకింగ్ ట్రాక్ పనులను ఆయన పరిశీలించారు.

పాఠశాలకు సీఐ విరాళం

కర్నూలు క్రైం: కల్లూరు మండలం, దూపాడు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కర్నూలు నాలుగో పట్టణ సీఐ మధుసూదనరావు విరాళం అందించారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం పాఠశాలకు వెళ్లి విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. పాఠశాలకు బీరువా, కుర్చీలను విరాళంగా అందించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

ఆలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలను వినియోగించుకోవాలని రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈరన్న, మాజీ సైనికులు నర్సిరెడ్డి కోరారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆరంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వచ్చి చదువుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈనెల 20వరకు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంధాలయ చైర్మన్ రామమూర్తి నాయుడు పాల్గొన్నారు.

ఆలూరు సీఐగా వెంకట చలపతి



ఆలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు సీఐగా వెంకట చలపతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు సీఐగా ఉన్న శ్రీనివాస నాయక్‌ను వీఆర్‌కు పంపడంతో అన్నమయ్య జిల్లా నుంచి సీఐ వెంకట చలపతి బదిలీపై నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డుకట్ట వేసి శాంతి భద్రతలను గాడిలో పెడతామన్నారు. ఇందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

హాలహర్వి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే పంచాయతీ నిధులతో ముందస్తుగా ప్రణాళికతో సిద్ధం చేయాలని ప్రణాళికల ఆధారంగా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చక్రవర్తి, ఐసీడీఎస్ సుపర్‌వైజర్ చందన పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వెల్దుర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. 18న గ్రామ సచివాలయాల ఎదుట నిర్వహించే ఆందోళనల కరపత్రాలను విడుదల చేశారు. చిలిపికృష్ణ, గిరి, రాజు, చిన్నమాదులు, సుమంత్‌లు పాల్గొన్నారు.

అధికారులు రాజకీయాలు చేయొద్దు

ఆదోని రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అధికారులు రాజకీయాలు చేయకుండా ఉద్యోగాలు చేయాలని సీపీఎం నాయకులు వెంకటేశులు, లింగన్న సూచించారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ పాండవగల్లు ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిరాధారణ ఆరోపణలతో తొలగించడం ఏమిటని ఎమ్మెల్యే, చోటా, మోటా నాయకులు ఆదేశాలతో ఫీల్డ్ అసిస్టెంట్ ఈరమ్మను ఎలా తొలగిస్తారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏపీవో ఖాలీక్‌లకు వినతిపత్రం అందజేశారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

మద్దికెర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం అమలు చేసే నిధులతో గ్రామాభివృద్ధికి సహకరించాలని శిక్షణ కోఆర్డినేటర్ సుధాకర్, పరమేశ్వరప్ప అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు సమావేశం జరిగింది. పంచాయతీలలో నీటి సమస్య తలెత్తకుండా చుడాలని అన్నారు.



ఆదోనిలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నృత్యం చేస్తున్న చిన్నారులు



ఆదోని కెచెన్ పేట పురపాలక పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా బాలల దినోత్సవం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా దేశ మాజీ ప్రధాని చాచా నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళులర్పించారు. ముద్దులొలికే చిన్నారులు దేశ నాయకుల వేషధారణలో వచ్చి ఆటపాటలతో అలరించారు. మిల్టన్ గ్రామర్ పాఠశాల కరస్పాండెంట్ రమేష్ బాబు, కిలిచిన పేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సునీల్ రాజ్ కుమార్ మాట్లాడుతూ చిన్నారులు ఆరోగ్యంగా ఆనందంగా ఉండడం ఆవశ్యకమన్నారు. విందు శ్రీ పాఠశాల కరస్పాండెంట్ నాగేంద్ర, సెయింట్ ఆంథోని పాఠశాల హెచ్‌ఎం కేశవయ్య పాల్గొన్నారు.

తుగ్గలి: విద్యార్థుల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందని ఎంఈవో రమావెంకటేశ్‌గౌడు, విద్యా కమిటీ చైర్మన్ రవియాదవ్ అన్నారు. గురువారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి, పెండెకల్లు ఆర్‌ఎస్ తదితర గ్రామాలలో బాలల దినోత్సవం పుర‌స్కరించుకొని మాజీ ప్రధిని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపేంద్ర, బాబురావు, చందు నాయక్, పాండురంగరాజు, భాస్కర్, చంద్రశేఖర్ ఉన్నారు.

ఆలూరు రూరల్: విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మొలగవల్లి స్టేట్ బ్యాంక్ మేనేజర్ హరేరామ చంద్రయ్య అన్నారు. గురువారం మొలగవల్లిలో నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు చేసి గ్రంథాలయ వారోత్సవాలను మేనేజర్ హరే రామచంద్రయ్య ప్రారంభించారు.కార్యక్రమంలో లైబ్రరీయన్ కంది భాస్కర్, కాకభూపేశ్, పంచాయతీ సుపర్ వైజర్ రామంజినేయులు పాల్గొన్నారు.

మద్దికెర: మద్దికెర గ్రామంలోని శ్రీవిద్యసాయి, ఫ్రెండ్స్ విద్యానికేతన్ ,ఆదర్శ పాఠశాల,జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. గురువారం బాలల దినోత్సవం పురస్కరించుకొని మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రంగస్వామి, ప్రిన్స్‌పాల్ బాలసునీత, రామాంజినేయులు, సవిత, దేవెంద్రప్ప,తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: దేవనకొండలో ఘనంగా బాలల దినోత్సవం జరిగింది. యంపీపీ పాఠశాల, సరస్వతి, రెయిన్‌బో, వీబీఆర్, జ్ఞానసుధ, కెజీబీవీ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఆదోని టౌన్ : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం దేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 135వ జయంతి వేడుకలను పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తు చేసుకొన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు మారుతి రావు, దేవిశెట్టి వీరేష్, విద్యార్థి విభాగం నాయకుడు శ్రీనిత్ మాణిక్య రాజ్, నిసార్ అహమ్మద్, రామన్న యాదవ్, హనుమంతు, మధు, రవి కుమార్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యాలయంలో నెహ్రూ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు



ఆదోని సెయింట్ ఆంథోని పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



మద్దికెరలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



తుగ్గలిలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎంఈవో, విద్యా కమిటీ చైర్మన్



దేవనకొండలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న చిన్నారులు

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు విజయవాడ బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్ చేపట్టారు. గురువారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మాధవరం సమీపంలోని ఇస్పత్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని విద్యార్థులు సందర్శించారు. కంపెనీలో ఖనిజాల నుంచి ఐరన్ తయారు చేసే విధానం దాని ప్రమాణాలు పరీక్షించే విధానాన్ని కంపెనీ ప్రతినిధులు వివరించారు. విద్యార్థులకు ఆయా పరిశ్రమలను సందర్శించడం వల్ల వారికి మరింత విజ్ఞానాన్ని అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని స్టాండర్డ్స్ క్లబ్ శిక్షకుడు సుధాకర్ బాబు తెలిపారు. కార్యక్రమంలో బీఐఎస్ ప్రతినిధులు ముఖేష్, మారుతి, ఇసుపత్, కంపెనీ మేనేజర్ రాజు, ఉపాధ్యాయులు కళ్యాణి, సువేద, శ్వేత, శ్యామల పాల్గొన్నారు.

పోసాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

పత్తికొండ, నవంబరు14(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు పోసాని క్రిష్ణ మురళిపై చర్యలు తీసుకోవాలని పత్తికొండలో టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు మునినాయుడు అన్నారు. గురువారం సీఐ జయన్నకు ఫిర్యాదు చేశాడు. ఆయన మాట్లాడుతూ సమాజంలో గౌరవప్రదమైన స్థితిలో ఉన్న బీఆర్‌నాయుడితోపాటు ముఖ్యమంత్రిపై పోసాని బూతులతో కూడిన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోసానిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

నిధులు మంజూరు చేయాలి

పత్తికొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ క్రీడా మైదానం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కళాశాలలు, పాఠశాలలకు క్రీడా మైదానాలు కల్పించాలని పత్తికొండ టీడీపీ నాయకులు శాప్ చైర్మన్ రవినాయుడుకు వినతిపత్రం అందించారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తినిలోక్‌నాథ్, ఎస్టీసెల్‌రాష్ట ఉపాధ్యక్షుడు వెంకటపతి, రైతసంఘం నాయకులు చౌదరి, హరి గురువారం విజయవాడలో చాంబర్‌లో ఆయన కలిసి మాట్లాడారు. పత్తికొండ ప్రాంతంలో విద్యార్థులు క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారన్నారు. కోచ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు అథ్లెట్ విభాగంలో శిక్షణను అందించే అవకాశాలు కల్పించాలన్నారు. అలాగే కళాశాలలు, హైస్కూల్‌లకు క్రీడామైదానాలు లేవని, మైదానాల ఏర్పాటుపై దృష్టి సారించాలని కోరారు.

సొసైటీల అభివృద్ధికి సహకరించాలి

తుగ్గలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సొసైటీలు అభివృద్ధి చెందాలంటే రైతులు, లబ్ధిదారులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సహకరించాలని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ చీఫ్ శ్రీనివాసులు, సీఈఓలు మనోహర్ నాయుడు, గిడ్డయ్యలు అన్నారు. గురువారం మండలంలోని ఆర్ఎస్ పెండేకల్లు, జొన్నగిరిలో మారెల్ల, ఉప్పర్లపల్లి సొసైటీల్లో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలలో భాగంగా జెండా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దాదాపు ఈ వారోత్సవాలు 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది మధు, నాగరాజు, సూపర్ వైజర్ పులిసాయిప్రసాద్ ఉన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని రూరల్ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వచ్చిన అవకాశాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీవో నూర్జహాన్ అన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రణాళిక, 2025-26 కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎంపీపీ భవనంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, ఏపీడీ లోకేష్‌లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

పత్తికొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నెలకొన్న ప్రజాసమస్యలు పరిష్కంచాలని సీపీఎం మండల కార్యదలర్శి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఈశ్వర్‌రెడ్డి భవనం నుంచి ప్రజాపోరు పిలుపులో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. వెంకటేశ్వరరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



ఆలూరు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆలూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కుటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీయస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాధాకృష్ణ ప్రజలకు మేలు చేయకపోగా భారం మోపడం దారుణమని అన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త విద్యుత్ మీటర్లు పెట్టే విధానాన్ని మానుకోవాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయాలని కోరారు. రైతు భరోసా కింద సాధారణ రైతులకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. బీజేపీతో రాష్ట్ర ప్రభుత్వం మద్దుతు ఇస్తున్నప్పటికీ రాష్ట్రానికి పెద్దగా ఒరిగిందేమీ లేదన్నారు. అనంతరం తహసీల్దార్ గోవిందు సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు నారాయణ స్వామి, మండల కార్యదర్శి షాకిర్, ఈరన్న, మైన, షేకున్ బీ విఠల్, నాగరాజు, పరమేశ్, వీరేశ్ పాల్గొన్నారు.

ఆదోని : కరెంటు చార్జీలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్‌లో భాగంగా వాగ్దానాలను అమలు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కే వెంకటేశులు డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి డీ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి లింగన్న, కార్యవర్గ సభ్యులు పీఎస్ గోపాల్, మహానంద రెడ్డి, పాండవగల్ గ్రామ సర్పంచ్ కె ఉమాదేవి, ఉచ్చిరప్ప పాల్గొన్నారు.

వెల్దుర్తి: ట్రూఅప్ చార్జీలను రద్దుచేసి, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు నగేశ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖరవర్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజు, చిన్నయేసు, రాముడు, సత్యం, పాపారాయుడు, నాగన్న, హరి, సునీల్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



వెల్దుర్తిలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

వాటర్ షెడ్ పథకం పనులు ప్రారంభం

ఆదోని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామంలో డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై వాటర్ షెడ్ 2.0 పథకం కింద మిషన్ ఫారంఫాండ్‌ను రాష్ట్ర కురుబ సంఘం చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి ఆదేశాల మేరకు గ్రామంలో ముమ్మరంగా వాటర్ షెడ్ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రంగనాథ్ రెడ్డి మాట్లాడుతూ రైతుల గురించి నిరంతం ఆలోచించి, వారికి ఉపయోగపడే మరెన్నో పథకాలు కూటమి ప్రభుత్వం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ కమిటి చైర్మన్ అంగడి వీరేష్, బీజేపీ నాయకులు కోగిటి సంతోష్, బోయ రాఘవ, మల్లికార్జున రెడ్డి, మాల వీరప్ప, మాల శేఖర్, టీడీపీ నాయకులు నల్లారెడ్డి నాగప్ప, చింతపుడి గర్జప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ ఆదెప్ప, జాలవాడి గర్జప్ప పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలోనే రైతులకు భరోసా ఉంటుందని టీడీపీ రైతు కమిటీ తాలూకా అధ్యక్షులు కురువ దేవేంద్రప్ప అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రైతుల సంక్షేమంను పూర్తిగా విస్మరించిందన్నారు. కుటమి ప్రభుత్వం వచ్చాక తొలి రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు 43వేల కోట్లు కేటాయించడంతో రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి పభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. సమావేశంలో మరకట్టు సర్పంచి బురిజింటి ఎల్లప్ప, టీడీపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వరులు, మరిదాస్, యంమల్లప్ప పాల్గొన్నారు.



పెద్దహరివాణం గ్రామంలో పూజలు చేసి పనులు ప్రారంభిస్తున్న దేవేంద్రప్ప

కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

ఆదోని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కురువ సంఘం సభ్యుల కోసం కమ్యూనిటీ హాలుతో పాటు ఆశ్రమం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మాదాసి, మదారి కురువ సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి పెద్దహ్యాట మల్లయ్య, కనకశ్రీ యూత్ నాయకుడు ఎస్కే గిరిలు కోరారు. గురువారం కనకదాసు భవనం ఏర్పాటు కొరకు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ హాళగుంద గ్రామ శివారు కడ్లేమాగి వెళ్లే రహదారిలోని సర్వే నెంబర్ 373లో 0.30 సెంట్లు కురువ సంఘానికి సంబంధించిన కార్యక్రమాలను గత ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. అలాంటి స్థలంలోనే కమ్యూనిటీ హాల్‌తో పాటు ఆశ్రమం నిర్మాణం చేపట్టాలని కోరారు. అందుకు సబ్ కలెక్టర్ సైతం సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కన్వీనర్‌కు కురువ పంపావతి, శివ, బసవ, శంకర్, నాగేంద్ర, నరసారెడ్డి పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడుదాం

పత్తికొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పేదలకు స్థలాలు పంపిణీ చేసి, వాటిలో ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య అన్నారు. గురువారం స్థానిక చదువుల రామయ్య పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల సమితి సమావేశం మండల కార్యదర్శి రాజాసాబ్ అధ్వర్యంలో నిర్వహించారు. గిడ్డయ్య మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పేదలకు సెంటు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణాలకు రూ.లక్ష80వేలు ఇవ్వడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయని అన్నారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా కార్యదర్శి నబిరసూల్, మద్దికెర, తుగ్గలి మండలాల కార్యదర్శులు నాగరాజు, సుల్తాన్, ప్రజాసంఘాల నాయకులు కారన్న, ఉమాపతి, తిమ్మయ్య, రామాంజినేయులు, సిద్ధూ,హనుమేష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

దేవనకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దేవనకొండలోని భవ్య మద్యం దుకాణంలో చోరీ జరిగింది. గురువారం తెల్లవాజామున ఇద్దరు దొంగలు బైక్‌పై వచ్చి దుకాణంలోకి చోరబడ్డారు. దుకాణంలో నగదు రూ.9500 తీసుకెళ్లినట్లు దుకాణం యజమానులు స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దొంగల కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. బైక్‌పై వచ్చిన యువకులు దాదాపు 30 ఏళ్ల లోపువారే కావడం గమనార్హం.

'ఇసుక' రిజిస్ట్రేషన్ తప్పనిసరి



మాట్లాడుతున్న బాలు నాయక్

కౌతాళం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఉచిత ఇసుక విధానం ప్రవేశ పెట్టిందని, అయితే ఇసుక కావాల్సిన వారు ముందుగా తమ పేర్లను గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారి బాలునాయక్ తెలిపారు. కౌతాళం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. మైనింగ్ అధికారి మాట్లాడుతూ మండలంలోని మరళి గ్రామంలో ఉన్న ఇసుక రీచ్ నుంచి ఇసుకను ఉచితంగా తీసుకోవచ్చన్నారు. అయితే సచివాలయంలో పేర్లు నమోదు చేసుకొని టన్నుకు రూ.119ల ప్రకారం నగదును చెల్లించి ఇసుకను తీసుకుపోవచ్చని, అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మల్లికార్జున స్వామి, డిప్యూటీ తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి, కౌతాళం సీఐ అశోక్ కుమార్, మండల వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు మంత్రాలయంలో తుంగా హారతి

మంత్రాలయం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో శుక్రవారం తుంగా హారతి, లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి తెలిపారు. కార్తీక శుద్ధ పౌర్ణమి శుభసందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేస్తారు. నదితీరంలో వీఐపీ ఘాట్ వద్ద ప్రత్యేక వేదిక పై ప్రహ్లాదరాయలకు పూజలు చేసి పండితులు హారతులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. అక్కడే భక్తులు లక్ష దీపాలు వెలిగిస్తారు.

శ్రీమఠంలో ఆకట్టుకున్న వీణా వాయిద్యం



వీణా వాయిద్యం చేస్తున్న వాణి గాన మందిర్ కళాకారులు

మంత్రాలయం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో బెంగళూరుకు చెందిన వాణి గాన మందిర్ సంస్థ కళాకారులచే నిర్వహించిన వీణావాయిద్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. గురువారం కార్తీక త్రయోదశి శుభసందర్భంగా యాగశాలలో ఇందిర మూర్తి, పల్లవి శశాంక్, సుబ్బులక్ష్మి, మృదుల, గాయత్రి శ్రీనివాస్, చిన్మయి, ప్రేమసుధ, నళిని, వెంకటేష్ మూర్తి, జయరాజ్, నవీన్, హిమా, సరస్వతి, దీప్తిలచే నిర్వహించిన ఆధ్యాత్మిక భక్తి పాటలు అలరించాయి. కళాకారులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు నగదు, ఫల, పుష్ప, శేషవస్త్రం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పద్మనాభ ఆచార్, జయతీర్థ ఆచార్, వ్యాసరాజ ఆచార్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

గోనెగండ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు రాయలసీమ రిటైర్డ్ ఐజీ ఇక్బాల్ గురువారం క్రీడా సామగ్రిని అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి సతీష్ తెలిపారు. ఫుట్, త్రోబాల్, వాలీబాల్, బ్యాస్కెట్ బాల్‌లకు సంబంధించిన క్రీడా సామగ్రి అందజేశారు.

వరికి దోమ పోటు

ఆందోళనలో రైతులు

గోనెగండ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వరి పంటకు వైరస్ సోకింది. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అడపాదడప కురిసిన వర్షాల కారణంగా వాతావరణంలో జరిగిన మార్పుల వల్ల పంటపై బలంగా వైరస్ సోకింది. దీంతో వరి పంట ఎండుతుంది. మండలంలో చాలా గ్రామాల్లో బావులు, బోర్ల, రైతులు 650 ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. గోనెగండ్ల, గాజులదిన్నె, కులుమాల, హెచ్ కైరవాడి, పుట్టపాశం, వేముగోడు, తిప్పనూరు, అలువాల, లింగందిన్నె, గ్రామాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటను సాగు చేశారు. గత వారం రోజులుగా పంటకు దోమపోటు, కాండం తొలుచు పురుగు సోకడంతో దాదాపు 400 ఎకరాల్లో వరి పంట ఎండిపోతుంది. ముదురు వరి పైరు కంకికి పాలు పోసే దశలో ఉండగా లేత వరి పైరు చిరు పొట్ట దశలో ఉంది. నెల రోజుల్లో పంట చేతికి అందే సమయంలో దోమ పోటు సోకుంది. వరి పైరు ఆశాజనకంగా ఉన్న తరుణంలో పంటకు సుడి దోమ, తెల్లదోమ సోకింది. ఈ దోమ వరి దుబ్బలలో చేరి పత్రహరితాన్ని పీల్చివేస్తుంది. దీంతో 20శాతం పంట ఎండిపోయే పరస్థితి ఏర్పడుతుంది. పలు రకాల మందులు వాడినప్పటికి ప్రయోజనం లేకుండా పోతుం దని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దోమ పోటు తెగులు సోకిన వరి పంట

అదునులో వర్షాలు కురియని కారణంగా వింత రోగాలు ప్రబలు తున్నాయని రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికి ఎకరా నికి రూ.35వేల పెట్టుబడి పెట్టారు. అయితే దిగుబడి మాత్రం తగ్గుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పెట్టినపెట్టుబడుల చేతికి అందేవిధంగా కూడా పరిస్థితి కనిపించడం లేదని రైతులు దిగాలు చెందుతున్నారు. గత ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతన్నలకు నష్టలే మిగులుతున్నాయి.

దోమ పోటు తెగులుతో నష్టపోతున్నాం



రెండు ఎకరాల్లో వరి పంటసాగు చేశాను. ఎకరానికి రూ.35వేల పెట్టుబడి పెట్టాను. గింజలు పాలు పోసే సమయంలో దోమ పోటు తెగులు సోకి పంట ఎండిపోతుంది. పెట్టిన పెట్టుబడికి కూడా గింజలు పండే విధంగా లేవు. అప్పులే మిగులుతున్నాయి.

- శ్రీనివాసులనాయుడు, రైతు, గాజులదిన్నె

వాతావరణ మార్పులే కారణం



వరికి తెగుళ్ల సోకడానికి వాతావరణ మార్పులే కారణం. పగటి పూట సమయం తక్కువగా ఉండటం, రాత్రిపూట సమయం ఎక్కువగా ఉండటం వల్ల ఈలాంటి తెగుళ్ల అధికంగా సోకుతూ ఉంటాయి. వరి పంటకు అధికంగా నీరు కట్టకుండా ఆర పెట్టుకోవాలి. వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారి చేయాలి. పూత ప్రారంభం నుంచి 30 రోజుల వరకు సుడి దోమ నివారణకు గుళికలు వేయకుండా ఇమిడాక్లోప్రిడ్ 0.2 ఎంల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. గట్లపై కలుపు నివారించాలి.

- మహమ్మద్‌ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

ఘనంగా బాలల దినోత్సవం

మంత్రాలయం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) మంత్రాలయం, మాధవరం, తుంగభద్ర, చిలకలడోణ, సూగూరు, వగరూరు, విద్యానగర్, కస్తూర్బా, మోడల్ స్కూల్, చెట్నహళ్లి, ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు విఠోభరావు, భోజరాజ, శ్రీనివాసులు, జాన్సన్, లచ్చప్ప, లక్ష్మీకాంతం, శాంతి, ప్రసాద్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఆయా పాఠశాలల్లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి నివాళి అర్పించి విద్యార్థులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవోలు షైనుద్దీన్, రాగన్న హెచ్‌ఎంలు రామ్మోహన్, వీరేష్, నాగభూషణం, చరణ్ బసవ, సరళాదేవి, విజయ్‌కుమార్,రాజేష్‌గౌడు, అరవింద, గురుస్వామి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, మోడల్ స్కూళ్ల తోపాటు గ్రంథాలయంలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. నెహ్రూ చిత్ర పటానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రామాంజినేయులు, నీలకంఠ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గౌస్, విమల, హుస్సేన్ శ్రీరామ పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ, దీన్, మాబుబాషా, ఉసేన్ పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రమైన కోసిగి తోపాటు అన్నిగ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో గురువారం ఘనంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలం లోని పల్లెపాడు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి ఎంఈవో ముహినుద్దీన్ పూల మాల వేసి నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయులు దస్తగిరి బాషా, ఎస్‌ఎంసీ చైర్మన్ లక్ష్మనలకు ప్రముఖ పారిశ్రామిక వేత్త సత్యసాయి ప్రసాద్ రూ. లక్ష విలువ చేసే 40 సీలింగ్ ఫ్యాన్లు, ప్రిటర్స్‌ను పాఠశాలకు అందించారు.



మంత్రాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



గోనెగండ్లలో..

సహకార వారోత్సవాలు ప్రారంభం

ఎమ్మిగనూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని సహకార వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కో-ఆపరేటివ్ స్టోర్స్‌లో పర్సన్‌ఇన్‌చార్జీ మరళి రామరాజు సహకార జెండాను ఎగురవేశారు. అలాగే ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకులో మాజీ సీఈవో మల్లికార్జున జెండా ఎగురవేశారు. అలాగే మండల పరిధిలోని ఎర్రకోటలోని కడిమెట్ల సొసైటీ, ఎమ్మిగనూరు పట్టణంలోని సొసైటీలో సీఈవోలు దత్తాత్రేయ స్వామి, వేణుగోపాల్, కేడీసీసీ బ్యాంకులో మేనేజర్ నాయక్ జెండాను ఎగురవేసి వారోత్సవాలను ప్రారంభించారు. అలాగే శాఖగ్రంథాలయంలో 57వ గ్రథాలయ వారోత్సవాలను జడ్డి బాలికోన్నత పాఠశాల హెచ్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయుడు అడివన్న జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో స్టోర్స్ సభ్యులు అల్తాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

● మండలపరిదిలోని మాసుమాన్‌దొడ్డి గ్రామంలో గురువారం బాలలదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం శాంతిరాజు ఆద్వర్యంలో దేశ ప్రథమప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.



జెండాను ఎగురవేస్తున్న పర్సన్ ఇన్‌చార్జి రామరాజు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జలజీవన్ మిషన్‌తో తీరనున్న తాగునీటి సమస్య

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి



గోనెగండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులతో అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య తీరనుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి అన్నారు. పనులు వేగవంతంగా జరిగేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో ప్రస్తుతం తాగునీటి సమస్య లేదన్నారు.

ప్రశ్న: జలజీవన్ మిషన్ కింద ఎన్ని నిధులు విడుదల అయ్యాయి?

జవాబు: గోనెగండ్ల మండలంలోని 28 గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జలజీవన్ మిషన్ కింద రూ. 34.22 కోట్లు విడుదల అయ్యాయి. అందులో భాగంగా పనులు చేసేందుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: మండలంలో ఎన్నిగ్రామాలలో పనులు చేస్తున్నారు?

జవాబు: మండలంలోని 28 గ్రామాలలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారు. అందులో కొన్ని గ్రామాలలో ఇప్పటికే పనులు మొదలు పెట్టారు. పనులను శరవేగంగా జరిపేందుకు మా వంతు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: గోనెగండ్లలో జలజీవన్ పనులు ఎలా జరగనున్నాయి?

జవాబు: మండల కేంద్రమైన గోనెగండ్లకు జలజీవన్‌మిషన్ కింద రూ. 2.50 కోట్లు విడుదల అయ్యాయి. ఈ పనులను రెండు మూడు రోజులలో ప్రారంభిస్తాం. ఇప్పటికే గోనెగండ్లలో ఒక ఓహెచ్‌ఆర్ ట్యాంక్ పనుల దాదాపు పూర్తి అయ్యాయి. ఈ పనులు పూర్తి అయితే ఇక గోనెగండ్లకు తాగునీటి సమస్య తీరినట్లే.

ప్రశ్న: మిగతా తాగునీటి పథకాల పరిస్థితి ఏమిటీ?

జవాబు: మండలంలోని అలువాల గ్రామాలలో ఎస్ఎస్ ట్యాంక్ నుంచి తొమ్మిది గ్రామాలకు తాగునీరు వెళ్తుంది. అయితే గత వారం రోజుల క్రితమే రూ. 32 లక్షలతో ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు చేసి గ్రామాలకు నీటిని విడుదల చేస్తున్నాం. మండలంలో 178 చేతి బోర్లకు గాను 146 చేతి బోర్లు పని చేస్తున్నాయి. అలాగే పీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్ నీటి పథకాలు మండలంలో 58 ఉన్నాయి. అన్ని పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి.

సభ్యత్వంలో సోమలగూడురు టాప్: టీడీపీ

నందవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంలో సోమలగూడురు మండలంలో టాప్‌గా నిలిచిందని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం సోమలగూడురు సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. సభ్యత్వం వల్ల ప్రతి కార్యకర్తకు ఏమైనా ప్రమాదం జరిగితే ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రజకసంఘం నాయకులు చంద్ర, గోపాల్‌రెడ్డి, సతీష్, మధు, రామాంజీ, సురేష్ పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయాన్ని పెంచాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అక్టోబరు నెల 2వ తేదీ నుంచి ప్రతి రోజు తప్పని సరిగా ప్రతి గ్రామ పంచాయతీలో వర్మీకంపోస్టును తయారు చేసి పంచాయతీలకు ఆదాయం పెంచాలని ఈవోఆర్‌డీ అనంతశయన అన్నారు. గురువారం గోనెగండ్లలోని చెత్త సంపద కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రోజుకు ఎంత చెత్త సేకరిస్తున్నారని దాంతో ఎంత వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారని కార్యదర్శి సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి పంచాయతీ అధికారులు పాటించాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, వీధిదీపాల సమస్య లేకుండా చుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి సతీష్, మలాంగ్, సుబాన్, అనిల్, గ్రీన్‌అంబాసిడర్లు పాల్గొన్నారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి

గోనెగండ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలని సీఐ గంగాధర్ అన్నారు. గురువారం గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు పత్రాలులేని వాటికి జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ ఆటోల్లో ప్రయాణ చేసేటప్పుడు ఓవర్ లోడ్ ప్రమాదకం కాబట్టి అందులో ప్రయాణం చేయవద్దన్నారు. ప్రతి వాహనదారుడు తప్పక డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని సూచించారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు

గోనెగండ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటెడుదిన్నె గ్రామంలో గురువారం ఉచిత టీబీ మొబైల్ ఎక్స్‌రే పర్యటనలో భాగంగా 50 మందికి టీబీ(క్షయ) వ్యాధి పరీక్షలు నిర్వహించినట్లు టీబీ సూపర్‌వైజర్ వేణుగోపాలాచారి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలు ఒంటెడుదిన్నె, నెరుడప్పల, పిల్లగుండ్ల, తిప్పనూరు, వీరంపల్లి గ్రామాల ప్రజలు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకుల వన భోజనాన్ని జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాల్మీకి సంక్షేమ భవన్ స్థల ఆవరణలో వాల్మీకుల కార్తీక వనభోజనం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వనభోజన సమితి నాయకులు బంగారు వెంకటేష్, కొండయ్య, బీఎల్ నారాయణ పట్టణంలోని గ్లోబల్ ఇండస్ స్కూల్‌లో 17న ఆదివారం జరిగే వనభోజనాన్ని వాల్మీకులు కుటుంబ సమేతంగా హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో రంగన్న, దయాసాగర్, జగ్గాపురం ఉరుకుందు, యాపిలయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న మంత్రాలయం టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి

కోసిగి, నవంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని వైసీపీ సర్పంచ్ ఉసేనితో పాటు వైసీపీ కార్యకర్తలు వినోద్, సూరిలను కఠినంగా శిక్షించాలని మంత్రాలయం టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బాధితురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి భరోసా కల్పించారు. బాధితురాలి కుంటుబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, నిందితులను శిక్షించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, నాయకులు మాడిగెని అయ్యన్న, వక్రాని వెంకటేష్, చింతలగేరి నరసారెడ్డి, కురువ అయ్యన్న, ఈరమ్మ, తిక్కయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మంత్రాలయం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా నాయకులు అంజిబాబు, మండల కార్యదర్శిజయరాజు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దారు కార్యాలయం ముందు సూపర్ సిక్స్ పథకాల అమలు, స్థానిక సమస్యలపై ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీరు పైపులైన్లు చేపట్టాలని అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలు తగ్గించి పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారం కాకుండా చూడాలన్నారు. తహసీల్దారు ఎస్ రవికి వినతి పత్రం అందజేశారు. నాయకులు అనిల్, ప్రాణేష్, అంజి, రాజు, చిన్నతిక్కన్న, సురేష్, అంజనయ్య, ఇశ్రాయేలు పాల్గొన్నారు.

రూ.5 లక్షలు మంజూరు చేయాలి: సీపీఐ

మంత్రాలయం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి లక్ష్మన్న నాయక్‌లు డిమాండ్ చేశారు. గురువారం పరమాన్‌దొడ్డి తాండ గ్రామంలో ఇంటి పునాదులను చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, ఈరన్న, వీరేష్, ఓంకార్‌నాయక్, హనుమంతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నమూనాలు

గోనెగండ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని మోడల్ స్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో మోడల్ స్కూల్ చదువుతున్న పలు తరగతుల విద్యార్థులు నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. వాటిని ఎంఈవో రామాంజినేయులు, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ షహానాపర్వీన్, విద్యాకమిటీ చైర్మన్ గౌస్‌లు పరిశీలించారు. విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేశారు.

హామీలను నెరవేర్చాలి: సీపీఎం

ఎమ్మిగనూరు టౌన్,నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు వారు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్, విజయ్, కాశప్ప, సురేష్ పాల్గొన్నారు.

ఇంటి వద్దనే వైద్య పరీక్షలు

కోసిగి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని సజ్జలగుడ్డంతో పాటు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఉచిత వైద్య పరీక్షలతో పాటు సర్వే నిర్వహించారు. సీహెచ్‌వో ఈశ్వరమ్మ పాల్గొన్నారు.